

## బదిలీలకు 199 దరఖాస్తులు

**కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 24:** జిల్లాలో రెవెన్యూ శాఖలో బదిలీలు కోరుతూ 193 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు 92 మంది, మెడికల్ కింద 8 మంది, స్పౌజ్ కింద ముగ్గురు, అసోసియేషన్ తరఫున ఆరుగురు, అంతర్ జిల్లా పరిధిలో 144 మంది, నంద్యాల జిల్లా నుంచి కర్నూలు జిల్లాకు 28 మంది, కర్నూలు జిల్లా నుంచి నంద్యాల జిల్లాకు 20 మంది, కర్నూలు నుంచి ఇతర జిల్లాలకు ఒకరు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు.

## దేవరబెట్ట.. వెళ్లేదెట్టా....?

- భారీ వర్షానికి కొట్టుకుపోయిన కల్వర్టు రోడ్డు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



కొట్టుకుపోయిన కల్వర్టు రోడ్డులో ప్రమాదకరంగా వాగు దాటుతున్న విద్యార్థులు

**కోసిగి, ఆగస్టు 24:** భారీ వర్షానికి దేవరబెట్ట గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు కల్వర్టు తెగిపోయింది. దీంతో విద్యార్థులు, గ్రామస్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నుంచి 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు 50 మంది విద్యార్థులు జంపాపురంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, కోసిగిలోని మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు వెళ్తున్నారు. కల్వర్టు తెగిపోయి మూడు రోజులు కావస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. దీంతో గ్రామానికి చెందిన యువకులు విద్యార్థులను కల్వర్టు దాటించి వెళ్తున్నారు. ఇక వాహనాలు, అంబులెన్సులు గ్రామంలోకి వచ్చే పరిస్థితి లేదు. వైద్యం అత్యవసరమైతే తమ పరిస్థితి ఏమిటని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామానికి చెందిన యువకులు అనిల్ కుమార్, వీరేష్, భానుచంద్ర, అంజి తదితరులు కోరుతున్నారు.



భారీ వర్షానికి కొట్టుకుపోయిన దేవరబెట్ట కల్వర్టు రోడ్డు



# త్వరలో కొత్త ఎక్సైజ్ పాలసీ

- రద్దు కానున్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో
- పాత పద్ధతిలోనే మద్యం అమ్మకాలకు శ్రీకారం
- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ స్టేషన్లకు వెళ్లేందుకు అధికారుల తాపత్రయం
- స్టేషన్‌ను బట్టి రూ.5 నుంచి15 లక్షల వరకు డిమాండ్
- చెక్‌పోస్టులు, విజిలెన్స్ పోస్టులకు ఆసక్తి చూపని యువ అధికారులు
- వైసీపీ సర్కారులో చక్రం తిప్పిన సీఐలకే ప్రజాప్రతినిధుల లేఖలు

కర్నూలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను రద్దు చేసి కొత్త ఎక్సైజ్ పాలసీ తీసుకురానున్నారు. మద్యం అమ్మకాలు కూడా పాత పద్ధతిలోనే చేపట్టనున్నారు. గతంలో మాదిరిగా వేలం పాటల ద్వారా మద్యం దుకాణాలు ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ నెల 28న మంత్రివర్గం ఆమోదం తరువాత పూర్తిగా పాత స్వరూపంలోకి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ రానుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లకు డిమాండ్ పెరిగింది. ఫలానా స్టేషన్‌లో పోస్టింగ్ ఇప్పించాలంటూ ఇప్పటికే కొందరు ఎక్సైజ్ సీఐలు ఎంపీలు, ఎమ్మెల్యేలను కలిసి పైరవీలు చేస్తున్నారు. సిఫారసు లేఖలు ఇవ్వాలంటూ మద్యం అమ్మకాలను బట్టి ఒక్కో స్టేషన్‌కు ఒక్కో రేటు చొప్పున రూ.5 నుంచి15 లక్షల వరకు ఆఫర్ ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం చెక్‌పోస్టులు, స్క్వాడ్లు బలోపేతం చేయడా నికి చర్యలు తీసుకుంటున్నా.. యువ అధికారులు ఆసక్తి చూపడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో చక్రం తిప్పిన సీఐలకే కీలక స్టేషన్లలో పోస్టింగ్ కోసం కొందరు ప్రజాప్రతినిధులు సిఫారసు లేఖలు ఇచ్చినట్లు సమాచారం.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 సెబ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ నెల 28 తరువాత నూతన ఎక్సైజ్ పాలసీ అమల్లోకి వస్తే ఇవి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లుగా మారనున్నాయి. కర్నూలు జిల్లాలో 83 మద్యం దుకాణాలు, 28 బార్లు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 93 మద్యం దుకాణాలు, 22 బార్లు ఉన్నాయి. ఆయా మద్యం షాపులు, బార్లు ద్వారా ఏడాదికి సగటున 1,721.50 కోట్ల విలువైన 26.24 లక్షలు ఐఎంఎఫ్‌ఎల్ (లిక్కరు), బీర్లు అమ్మకాలు జరుగుతున్నాయి. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) స్టేషన్లుగా మార్చింది. ప్రభుత్వమే మద్యం అమ్మకాలు చేపట్టింది. జగన్ ప్రభుత్వంలో కొందరు మద్యం అమ్మకాల్లో భారీ ఎత్తున అవినీతి అక్రమాలు తెర తీశారనే ఆరోపణలు ఉన్నాయి. మద్యం రేట్లు భారీగా పెంచడమే కాకుండా గతంలో ఉన్న అంతర్జాతీయ బ్రాండ్లను కాదని ఎన్నడూ ఎరుగని వివిధ బ్రాండ్ల పేరిట అమ్మకాలు చేపట్టారు. మద్యం పాలసీ మార్చేసి జే బ్రాండ్ల స్థానంలో అంతర్జాతీయ గుర్తింపు కలిగిన బ్రాండ్ల మద్యం సరసరమైన ధరలకే అందుబాటులోకి తెస్తామని ఎన్నికల ముందు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి స్పష్టమైన హామీ ఇచ్చింది. అందులో భాగంగానే గత జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన విఫల ప్రయోగానికి స్వస్తి చెప్పి.. పూర్తిగా పాత స్వరూపంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖగా మార్చనున్నారు.



### స్టేషన్.. స్టేషన్‌కు ఒక రేటు

మద్యం అమ్మకాలను బట్టి స్టేషన్.. స్టేషన్‌కు ఒక రేటు ఉందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. పోస్టింగ్ ఇప్పించేందుకు కొందరు మద్య దళారీలు రూ.5 నుంచి రూ.15 లక్షలకు పైగా డిమాండ్ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఉమ్మడి జిల్లాలో 2023-24లో మద్యం దుకాణాలు, బార్ల ద్వారా రూ.1,721.39 కోట్లు మద్యం అమ్మకాలు జరిగాయి. ఒక్కో షాపులో ఏడాదికి రూ.3 నుంచి 15 కోట్ల మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని అంచనా. పాత మద్యం పాలసీ అమల్లో ఉన్నప్పుడు లైసెన్సుదారులకు అమ్మకాలపై 18-20 శాతం వరకు మార్జిన్ (లాభం) ఇచ్చేవారు. రెండేళ్ల కాలానికి మద్యం దుకాణాలు లీజుకు ఇస్తే.. ఒక ఏడాది ఆదాయం లైసెన్సు ఫీజు కింద పోయినా రెండో ఏడాది అమ్మకాలపై ఆదాయం వస్తుందని గతంలో మద్యం అమ్మకాలు అనుభవం ఉన్న లైసెన్సుదారులు పేర్కొంటున్నారు. అదే క్రమంలో మద్యం అమ్మకాలపై సంబంధిత ఎక్సైజ్ స్టేషన్‌కు నెల మామూళ్లు ఉంటాయని, అందుకే చెక్‌పోస్టులు, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ ఉద్యోగాలు వద్దని స్టేషన్ల పోస్టులు కావాలని పలువురు సీఐలు పెద్దఎత్తున పైరవీలు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యేలు చెప్పినట్లు చక్రం తిప్పిన ఎక్సైజ్ సీఐలు కొందరు టీడీపీ కూటమి ప్రభుత్వంలో కూడా వివిధ మార్గాల్లో ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకుంటూ నియోజకవర్గాలు మారుతున్నారే తప్ప పెత్తనం వదులుకోవడం లేదని రాజకీయ పలుకుబడి లేని అధికారులు కొందరు వాపోతున్నారు.

### వామ్మో.. చెక్‌పోస్టులా..?

జిల్లాలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో కర్నూలు రూరల్ మండలం పంచలింగాల, సుంకేసుల, నందవరం మండలం నాగులదిన్నె, మంత్రాలయం మాధవరం, కౌతాళం మండలం బాపురం, ఆదోని మండలం పెద్దహరివాణం, హొళగుంద మండలం మార్లమడికి, హాలహర్వి మండలం ఛత్రగుడి వద్ద ఎక్సైజ్ చెక్‌పోస్టులు ఉన్నాయి. వీటితో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ టీంలు సరేసరి. నూతన పాలసీ ప్రకారం చెక్‌పోస్టులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్లను బలోపేతం చేసేలా ఎక్సైజ్ శాఖ పక్కా ప్రణాళిక రూపొందించింది. ఇక్కడ పని చేసేందుకు సీఐలు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. కోరుకున్న స్టేషన్ రాకపోతే ఎన్‌ఫోర్స్‌మెంట్, అక్కడ దొరకకపోతే చెక్‌పోస్టుతో సరిపెట్టుకుంటాం అంటున్నారు. మెజార్టీ యువ సీఐలు స్టేషన్లకు వెళ్లి.. పదవీ విమరణకు (రిటైర్డ్ స్టేజ్) దగ్గరలో ఉన్న సీఐలను చెక్‌పోస్టులో పోస్టింగ్ ఇస్తే నేరాలు అదుపు చేయడం కష్టమని, యువ సీఐలకు చెక్‌పోస్టు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్యూటీలు ఇస్తే నేరాలను సమర్థవంతంగా అదుపు చేయవచ్చని, రాజకీయ నాయకులు ఈ విషయం ఆలోచించాలని సీనియర్ అధికారి ఒకరు పేర్కొనడం కొసమెరుపు.




### సిఫారు లేఖల కోసం పైరవీలు

కర్నూలు జిల్లాలో 7, నంద్యాల జిల్లాలో 7 కలిపి 14 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. 8 చెక్‌పోస్టులు ఉంటే ప్రతి చెక్‌పోస్టులో సీఐ పర్యవేక్షణలో తనిఖీ టీం పని చేస్తుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంలు 2, ఏసీ టాస్క్‌ఫోర్స్ టీంలు జిల్లాకు ఒకటి, జిల్లా టాస్క్‌ఫోర్స్ టీఎంలు ఒక్కోటి ఉంటాయి. ప్రతి టీంలో సీఐ, ఎస్‌ఐ సహా సిబ్బంది ఉంటారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ టీంలు, చెక్‌పోస్టుల్లో యువ అధికారులను నియమిస్తే నేరాలను సమర్థవంతంగా అరకట్టే అవకాశం ఉంది. మెజార్టీ యువ సీఐలు వాటిపై ఆసక్తి చూపడం లేదు. నెలనెలా ఆదాయం వచ్చే స్టేషన్ల వైపే మొగ్గు చూపుతున్నారు. ఫలానా స్టేషన్‌లో తమకు పోస్టింగ్ ఇప్పించాలంటూ ఎక్సైజ్ సీఐలు కొందరు మద్య దళారీలు ద్వారా ఎంపీలు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొందరు సీఐలు సిఫారసు లేఖలు కూడా తీసుకున్నట్లు సమాచారం.

**ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాలు, 2023-24 మద్యం అమ్మకాల వివరాలు**

| వివరాలు | కర్నూలు | నంద్యాల | మొత్తం |
|---|---|---|---|
| మద్యం దుకాణాలు | 83 | 93 | 176 |
| బార్లు | 28 | 22 | 50 |
| ఐఎంఎఫ్‌ఎల్, బీర్లు అమ్మకాలు | 11.88 లక్షల కేసులు | 14.36 లక్షల కేసులు | 26.24 లక్షల కేసులు |
| మద్యం అమ్మకాలు విలువ | రూ.772.03 కోట్లు | రూ.949.46 కోట్లు | రూ.1,721.39 కోట్లు |
| ప్రభుత్వ ఆదాయం (రెవిన్యూ) | రూ.644 కోట్లు | రూ.792 కోట్లు | రూ.1,436 కోట్లు |

## ఉద్యమంగా స్పార్టన్ గ్రీన్ కర్నూలు

- పచ్చదనం పరిరక్షణ అందరి బాధ్యత
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది, డీఐజీ కోయ ప్రవీణ్



డీఐజీ కార్యాలయం వద్ద కోయ ప్రవీణ్



జిల్లా కోర్టులో మొక్కలు నాటుతున్న జి. కబర్ది

**కర్నూలు, కర్నూలు(లీగల్) ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత.. ప్రతి ఒక్కరూ ఇంటికో మొక్క నాటాలి.. ఆ మొక్క చెట్టుగా ఎదిగేలా సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ది, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ పేర్కొన్నారు. డ్వామా భాగస్వామ్యం, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సహకారంతో కర్నూలుకు చెందిన 'స్పార్టన్' యువతరం శనివారం 'స్పార్టన్ గ్రీన్ కర్నూలు' ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా వివిధ రకాల వృక్షజాతుల లక్ష విత్తనాలు పంపిణీ చేశారు. జిల్లా కోర్టు, డీఐజీ కార్యాలయం, రాయలసీమ విశ్వవిద్యాలయం, ఉద్యానవనాలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ ప్రైవేటు సంస్థల కార్యాలయాల ఆవరణాల్లో 30 వేల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. జిల్లా కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు, జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదులతో కలిసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ది మొక్కలు నాటి నీరు పోశారు. డీజీఐ కోయ ప్రవీణ్ తన కార్యాలయం ఆవరణలో, రాయలసీమ విశ్వవిద్యాలయం ఆవరణలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఎఫ్‌సీఐ పార్కు మైదానంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత స్పార్టన్ యువతతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత 'స్పార్టన్ గ్రీన్ కర్నూలు' ఉద్యమానికి సై అనడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో స్పార్టన్ అధ్యక్షుడు సయీమ్, కేతు మహదేవ్, చరితారెడ్డి, స్వరూప్, సలీమ్ పవన్, వంశీ, సమీర్, బాలాజీ, స్నేహిత్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఉద్యమానికి సతారం చిత్రాలు సినిమా నటీనటులు సహకారం అందించారు.

## పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకోండి: కలెక్టర్



**కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 24:** తరహా పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పండిస్తున్న టమోటా, ఉల్లి తదితర ఉత్పత్తుల మార్కెటింగ్, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం ద్వారా యూనిట్ల స్థాపనకు రూ.10 లక్షల రుణం మంజూరులో రూ.3.50 లక్షల సబ్సిడీ ఉందన్నారు. ఈ పథకం ద్వారా ఆదోని, పత్తికొండ తదితర ప్రాంతాల్లో చిన్న చిన్న టమోటా, ఉల్లి స్టోరేజ్, ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయించాలని అధికారులను సూచించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమల స్థాపనకు సంబంధించిన దరఖాస్తులను గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం ద్వారా యూనిట్ల స్థాపనకు యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చేలా పథకం వివరాలతో పత్రికా ప్రకటన జారీ చేయాలని, అలాగే కరపత్రాలు ముద్రించి పంపిణీ చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, పరిశ్రమల శాఖ జీఎం మారుతి ప్రసాద్, ఏపీఐఐసీ జీఎం సోమశేఖర్ రెడ్డి, ఐలా చైర్మన్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## ముగిసిన సప్తరాత్రోత్సవాలు

- సర్వ సమర్పణతో ముగింపు పలికిన పీఠాధిపతి
- సప్త వాహన రథోత్సవంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు



సప్త వాహన రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

**మంత్రాలయం, ఆగస్టు 24 :** మంత్రాలయం రాఘవేంద్ర స్వామి 353వ సప్తరాత్రోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పంచ వాహన రథానికి పూజలు చేసి ప్రారంభించారు. ఏడు రోజులు జరిగిన సప్తరాత్రోత్సవాలకు పీఠాధిపతి సర్వసమర్పణోత్సవంతో ఉత్సవాలకు ముగింపు పలికారు. శనివారం ఉదయం నుంచి రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు, అభిషేకాలు, అలంకరణ, మహామంగళహారతులు ఇచ్చారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను వజ్రాలతో పొదిగిన హారాలతో అలంకరించి స్వర్ణ పల్లకిలో అధిష్ఠించారు. అనంతరం ఊంజల సేవ చేశారు. ఆ తరువాత గజ వాహనం, చెక్క, వెండి, బంగారు, నవరత్నాల రథాలపై ఊరేగించారు. చక్క రథంపై అశ్వ, గజ, స్వర్ణ పల్లకి, మయూరి సప్త వాహనాలను సుందరంగా తీర్చిదిద్ది వాటి మధ్య రాఘవేంద్రస్వామి నిల్వ ప్రతిమను అలంకరించి అందులో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అధిష్ఠించి పీఠాధిపతులు మహామంగళ హారతులు ఇచ్చి పంచవాహన రథోత్సవాన్ని ఊరేగించారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని పంచ వాహన రథోత్సవాన్ని తిలకించి ఆనందపరవశులయ్యారు. పీఠాధిపతి పంచవాహన రథానికి సర్వసమర్పణోత్సవం చేసి మహామంగళహారతులు ఇచ్చి ముగింపు పలికారు. కార్యక్రమంలో బాలగర్ మఠం పీఠాధిపతి అక్షోభ్యరామ ప్రియ తీర్థులు , వ్యాసరాజ మఠం పీఠాధిపతి విద్యా మనోహర్ తీర్థులు, విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, మఠం దివాన్ సుజీంద్రాచార్, ఆనంద తీర్థాచార్, గౌతమాచార్, దక్షిణాది విచారణకర్త శ్రీమఠం సలహాదారు శ్రీనివాస్ కస్బే, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈలు బద్రినాథ్, శ్రీహరి, వ్యాసరాజాచార్, బిందు మాధవ్, ద్వారపాలక అనంతస్వామి, జయతీర్థాచార్, వాదిరాజాచార్‌లు పాల్గొన్నారు.



రాఘవేంద్ర స్వామి బృందావనం




కూచిపూడి నృత్యం చేస్తున్న కర్నూలు లాస్య ఇన్‌స్టిట్యూట్ కళాకారులు

### అలరించిన కూచిపూడి నృత్యం

ఉత్సవాల ముగింపులో భాగంగా యోగీంద్ర కళా మండపంలో కర్నూలు చెందిన లాస్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ బృందం, హైదరాబాదుకు చెందిన శ్రీసాయి దేవా కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వారిచే కూచిపూడి నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. హైదరాబాదుకు చెందిన వరవీణ మ్యూజిక్ అకాడమి వారిచే శాస్త్రీయ సంగీతం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. వీరి నృత్యాలను పీఠాధిపతి కనులారా తిలకించి నగదు, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.



పల్లకీలో ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు



# నయనం ప్రధానం..

● నేత్రదానంతో అంధులకు చూపు ● దాతల సంఖ్య పెరగాలి

● 25 నుంచి సెప్టెంబరు 8 వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 24:

సర్వేంద్రియాణాం నయనం ప్రధానం.. శరీరంలోని అన్ని అవయవాల కంటే కళ్లు ప్రధానమైనవని దీని అర్థం. మృతి చెందిన దాతల నుంచి కళ్లు సేకరించి చూపు లేని మరో ఇద్దరికి వెలుగులు నింపడమే కర్తవ్యంగా ఏటా ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8 వరకు జాతీయ నేత్రదానం అవగాహన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రపంచంలోని అంధుల సంఖ్యలో నాలుగో వంతు భారతదేశంలోనే ఉన్నారు. ప్రమాదాలు, పోషకాహార లోపం, అంటు వ్యాధులు, పుట్టుకతో వచ్చిన లోపాల కారణంగా అనేక మంది కంటి చూపు కోల్పోతున్నారు. వీరి కంటిలోని నల్లగుడ్డును మార్చగలిగితే చూపు వచ్చే అవకాశం ఉంటుంది. మరణించిన వారి కంటిలోని నల్లగుడ్డు సేకరించి అంధులకు అమర్చితే చూపు వస్తుంది. ఐ-కౌన్సిలర్లు కర్నూలు, నంద్యాల, ఆదోనితో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మృత్యువు తప్పదనుకున్న రోగుల కుటుంబ సభ్యులను నేత్రదానంపై చైతన్యపరుస్తున్నారు. వారి అంగీకారం మేరకు కంటిలోని నల్లగుడ్డు సేకరించి భద్రపరిచి ఎల్‌వీ ప్రసాద్ ల్యాబ్‌కు తరలిస్తున్నారు.

దేశంలో ప్రస్తుతం 11 లక్షల మంది అంధులు ఉండగా.. వారి సంఖ్య ఏటా 1.25 లక్షలు పెరుగుతుండటం ఆందోళనకరంగా ఉంది. గతంలో 40ఏళ్లపైబడిన వారు కార్నియా (నల్లగుడ్డు) వ్యాధితో అంధులు అవుతుండగా.. ప్రస్తుతం చిన్న పిల్లలు సైతం ఆ సమస్యతో బాధపడుతున్నారు. వీరికి దాతల నేత్రాలు అమర్చాల్సి ఉంటుంది. అయితే అవసరానికి తగ్గట్టు నేత్రాదాతలు ముందుకు రావడం లేదు. 20 శాతం మంది మాత్రమే నేత్రదానానికి సిద్ధమవుతున్నారు. ఎంతోమంది అంధులు దాతల కోసం ఎదురు చూస్తున్నారు.



### నేత్రదానం ఇలా చేయాలి

● కుటుంబ సభ్యుల సమ్మతితో మరణానంతరం నేత్రదానానికి అవకాశం ఉంటుంది.

● మరణించాక 6 నుంచి 8 గంటలలోపే కళ్లను సేకరించాలి.

● వయస్సు, లింగబేధం, రక్తం గ్రూపు, మతంతో సంబంధం లేకుండా ఎవరైనా నేత్రదానం చేయవచ్చు.

● శుక్ల వ్యాధి ఉన్న వారు, మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్న వారు కూడా కళ్లను దానం చేయవచ్చు. ఎయిడ్స్, హైపటైటిస్, బీపీ, బ్లడ్ క్యాన్సర్, ధనుర్వాతం, మెదడువాపు అంటు వ్యాధులు ఉన్న వ్యక్తులు నేత్రదానం చేయరాదు.

### జిల్లాలో ఐ బాల్స్ సేకరించిన కళ్లు

| సంవత్సరం | సేకరించిన కళ్లు |
|---|---|
| 2019-2020 | 377 |
| 2020-2021 | 176 |
| 2021-2022 | 264 |
| 2022-2023 | 412 |
| 2023-2024 | 488 |
| 2024 ఏప్రిల్ నుంచి ఆగస్టు 25 వరకు | 163 |

### నేత్రదానంపై విస్తృత ప్రచారం



జిల్లాలో నేత్రదానంపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో జాతీయ నేత్రదానం పక్షోత్సవాల సందర్భంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు, స్కూల్స్, కాలేజీలు, గ్రామాల్లో సదస్సులను ఏర్పాటు చేస్తున్నాం. ముఖ్యంగా విద్యాసంస్థల్లో విద్యార్థులకు చైతన్యం తీసుకువచ్చేలా కృషి చేస్తున్నాం. ప్రజలు మూఢ నమ్మకాలను వీడి నేత్రదానానికి ముందుకు రావాలి.

- డా.ఎల్. భాస్కర్, డీఎంహెచ్‌వో, కర్నూలు

### నేటి నుంచి నేత్రదాన పక్షోత్సవాలు



ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నాం. నల్లగుడ్డు తెల్లబడటం ద్వారా కంటి చూపును కోల్పోయిన వారికి దాతల నుంచి సేకరించిన నల్లగుడ్డును అమర్చుతారు. ఆడవారు, మగవారు ఏ వయస్సు ఉన్న వారైనా వ్యాధులతో చనిపోయినా నేత్రదానం చేయవచ్చు. కార్నియా వెనుక 3వేల సెల్స్ దాకా ఉంటాయి. ఇవి డ్రై కాకుండా చూసుకోవాలి. చనిపోయిన వెంటనే 6 గంటలలోపు 9849903116, 9640692299 నెంబర్లను ఫోన్ చేస్తే నేత్రాలను సేకరించడానికి ఒక బృందాన్ని పంపిస్తారు.

- డా.పి. వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రి

### నేత్ర దానానికి ముందుకు రావాలి



నేత్రదానానికి అందరూ ముందుకు రావాలి. దీనిపై అపోహలు విడనాడాలి. మరణించిన వారి నుంచి కంటిలోని నల్లగుడ్డు మాత్రమే సేకరిస్తారు. నేత్రదానానికి ముందుకువచ్చే వారు సమీపంలోని కౌన్సిలర్ గానీ, టెక్నీషియన్‌ను సంప్రదిస్తే వారు నేరుగా వచ్చి నేత్రాలను సేకరిస్తారు. కళ్లజోడు పెట్టుకునేవారు, మధుమేహం, బీపీ, ఉబ్బసం, వ్యాధులతో బాధపడేవారు కూడా నేత్రదానం చేయవచ్చు.

- పి. సుధాకర్‌రావు, సీనియర్ కంటి వైద్యనిపుణుడు, సుశీల నేత్రాలయ, కర్నూలు

## ఆలూరులో ఓటమి బాధాకరం

### టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

**కర్నూలు(అర్బన్), ఆగస్టు 24:** ఆలూరులో ఓటమి చెందడం బాధాకరమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమిలో ఎవరిని తప్పు పట్టడం లేదని, అందరూ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పని చేశారని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఎదురైన సమస్యలను గురించి చర్చించుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో వీరభద్రగౌడ్, జి. అశోక్ కుమార్, పరమారెడ్డి, సుధాకర్, వెంకటేశ్వర చౌదరి, మీనాక్షి నాయుడు, సీఎస్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ విస్తృత పర్యటన

**కర్నూలు(అర్బన్), ఆగస్టు 24:** ఎంపీ బస్తిపాటి నాగరాజు జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. శనివారం గోనెగండ్లలోని గాజుల దిన్నె ప్రాజెక్టును, ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ఎమ్మిగనూరులోని నవోదయ విద్యాలయాన్ని, ఆదోనిలోని ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనుల తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుల పనులు నాణ్యంగా జరగలేదని, కరకట్టలు బలహీనంగా కట్టారని అధికారుల మీద మండి పడ్డారు.

## చాగలమర్రిలో కుండపోత వర్షం

### పొంగి ప్రవహిస్తున్న రాజోలి ఆనకట్ట



రాజోలి ఆనకట్ట వద్ద పొంగి ప్రవహిస్తున్న వరద నీరు

**చాగలమర్రి, ఆగస్టు 24:** చాగలమర్రి మండలంలో శనివారం తెల్లవారుజామున కుండపోత వర్షం కురిసింది. గ్రామాల్లో రహదారులు జలమయమయ్యాయి. నూరానీ మసీదు, గంగమ్మ వీధి, ఎస్సీ కాలనీతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు జలమయమయ్యాయి. 21 మి.మీ. వర్షపాతం నమోదైంది. రాజోలి ఆనకట్ట వద్ద కుందూ నది పొంగి ప్రవహించింది. 15 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహంతో ఆనకట్టపై కుందూ నది ప్రవహించింది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పసుపు, మొక్కజొన్న, ఉల్లి, తదితర పంటలకు వర్షం జీవం పోసింది. కుందూ నది ఉధృతి పెరగడంతో పరిసర గ్రామాల ప్రజలు నదిని దాటరాదని కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, కూలీలకు సూచించారు.

## రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి



ప్రదక్షిణలు చేస్తున్న కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ నటరాజన్

**మంత్రాలయం, ఆగస్టు 24:** మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర హై కోర్టు జడ్జి జస్టిస్ నటరాజన్ శనివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహా ముఖ ద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈయన వెంట సూపర్నిండెంట్ అనంతపురాణిక్, బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్ పాల్గొన్నారు.

## లక్ష్యాలను గడువులోపు పూర్తి చేయాలి

**కర్నూలు(అర్బన్), ఆగస్టు 24:** విద్యార్థులకు అకడమిక్ బ్యాం క్ క్రెడిట్స్ ఏబీసీ ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్స్ ఏజెన్సీ గడువులోపు పూర్తి చేయాలని ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయ క్ ఆదేశించారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీలో అను బంధ కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్లు, ప్రొఫె షనల్స్‌తో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వన్ నేషన్ వన్ ఐడీ అన్న ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవడానికి యూనివర్సిటీకి సహకరించాలని కోరారు. రిజిస్ట్రార్, పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానం 2020 ప్రకారం ప్రతి ఒక్కరికీ ఏబీసీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేయాల్సిందిగా సూచించారు. 2021 కళాశాలల్లో చేరిన విద్యార్థులకు ఈ రిజిస్ట్రేషన్ తప్పని సరి అన్నారు. డీన్‌లు భరత్, విశ్వనాథరెడ్డి, ఆచార్య భరత్ పాల్గొన్నారు.

## హోస్పేట్ డ్యామ్ ఘటనతోనైనా మేలుకోవాలి: ఎంపీ



గాజులదిన్నె ప్రాజెక్టు అధికారులతో మట్లాడుతున్న ఎంపీ నాగరాజు

**గోనెగండ్ల, ఆగస్టు 24:** హోస్పేట్ డ్యామ్ ఘటనతోనైనా ఇక్కడి ఇరిగేషన్ అధికారులు మేలుకోవాల్సిన అవసరం ఉందని కర్నూలు పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం గాజులదిన్నె ప్రాజెక్టును ఆయన సందర్శించారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం.. ప్రస్తుతం ఎంత నీరు ఉంది.. వచ్చే రబీలో సాగు భూములకు నీరు ఇవ్వగలరా లేదా అని ఇరిగేషన్ ఈఈ శైలేష్, డీఈ విజయ్‌కుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్వహణ పట్ల అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కర్నూలు పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే వేదవతి, ఆర్‌డీఎస్, గుండ్రేవుల ప్రాజెక్టులు పూర్తి కావాలని అన్నారు. కర్నూలు జిల్లా అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాజులదిన్నె హనుమంతు, నాగన్న, జిల్లా తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ పాల్గొన్నారు.

## 26న ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు: కలెక్టర్

**నంద్యాల (కల్చరల్), ఆగస్టు 24:** కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్లో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ నెల 26న రద్దు చేశామని కలెక్టర్ రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 26వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో రద్దు చేశామని, ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కోరారు. సెప్టెంబరు 2వ తేదీన నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం ఆచూకీ లభ్యం

**ఓర్వకల్లు, ఆగస్టు 24:** ఓర్వకల్లు జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ లభించినట్లు ఎస్ఐ సునీల్ కుమార్ శనివారం తెలిపారు. నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామానికి చెందిన వడ్డెనూరు సుధాకర్ నాయుడు (50) అని తెలిపారు. ఈ నెల 20న ఓర్వకల్లు మండలం కేతవరం గ్రామంలో తన చెల్లెలితో రాఖీ కట్టించుకుని హుశేనాపురం గ్రామానికి వస్తుండగా.. ఓర్వకల్లు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద వాహనం ఢీకొట్టి రక్తగాయాలతో పడి వున్న అతన్ని చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 23న మృతి చెందాడు. ఈ విషయాన్ని మృతుని భార్య ఎల్లావతి గుర్తించి తన భర్తేనని నిర్ధారించుకుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గోవిందపల్లెలో వ్యక్తి మృతి

**శిరివెళ్ల, ఆగస్టు 24:** మండలంలోని గోవిందపల్లె గ్రామ శివారులో శనివారం సాయంత్రం ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గ్రామానికి చెందిన నక్క ప్రవీన్(45) అనే వ్యక్తి వారం రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా దాదాపు ఐదు రోజుల కిందట గ్రామ శివార్లలోని చెట్టు కింద మృతి చెందినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. మృతుడి భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు ప్రవీన్ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## నేడు కాశీభట్ల వేణుగోపాల్ సంతాప సభ

**కర్నూలు(కల్చరల్), ఆగస్టు 24:** ఇటీవల మృతి చెందిన కర్నూలుకు చెందిన ప్రముఖ కవి, రచయిత కాశీభట్ల వేణుగోపాల్ సంతాప సభ ఆదివారం ఉదయం 10 గంటలకు, నగరంలో మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో నిర్వహిస్తున్నట్లు ఆయన మిత్రులు తెలిపారు. కర్నూలు సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సంతాప సభకు సభాధ్యక్షుడిగా ప్రముక కవి జి. వెంకటకృష్ణ వ్యవహరిస్తారని, వక్తలుగా అనంతు చింతలపల్లి, పి. చంద్రశేఖర్, ఎం. దయానంద్ హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

## భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం

**ఆదోని, ఆగస్టు 24:** ఆదోని త్రీ టౌన్ పోలీసస్టేషన్ పరిధిలో భారీ ఎత్తున పేలుడు పదార్థాలు శనివారం పట్టుబడ్డాయి. ఆదోని నేషనల్ హైవేలో సంచిలో నిలువ ఉన్న జిలిటన్ స్టిక్స్ డిటోనేటర్స్ కేబుల్ బెండల్స్‌తో పాటు ఇతర పేలుడు పదార్థాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఓ వ్యక్తి అందించిన సమాచారంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే తహసీల్దార్ శివరాముడు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. త్రీటౌన్ సీఐ రామలింగప్ప పేలుడు పదార్థాలు ఉన్న సంచిను స్వాధీనం చేసుకున్నారు.

## కల్లూరు వీఆర్వో మద్దిలేటి బదిలీ

**కల్లూరు, ఆగస్టు 24:** కల్లూరు వీఆర్వో మద్దిలేటి డిప్యుటేషన్‌పై దేవనకొండ మండలం తెర్నేకల్‌కు బదిలీ అయినట్లు తహసీల్దారు కె.ఆంజనేయులు శనివారం తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా నుంచి ఉత్తర్వులు జారీ అయ్యా యని వెల్లడించారు. కల్లూరు వీఆర్వో మద్దిలేటి రికార్డులు హ్యాండోవర్ చేయాల్సి ఉందని, అందువల్ల రిలీవ్ చేయలేదని తహసీల్దారు స్పష్టం చేశారు. రికార్డులు హ్యాండోవర్ చేయగానే మద్దిలేటిని రిలీవ్ చేయనున్నట్లు తెలిపారు. అయితే సదరు వీఆర్వోపై పలు అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో కలెక్టర్ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా డిప్యుటేషన్‌పై బదిలీ వేటు వేసినట్లు సమాచారం.

## నీట్ పీజీలో వెలుగోడు యువకుల సత్తా



నాగశశి ప్రణయ్‌రెడ్డి



రాజకుమార్

**వెలుగోడు, ఆగస్టు 24:** నీట్ పీజీలో వెలుగోడుకు చెందిన ఇద్దరు యువకులు సత్తా చాటారు. వెలుగోడు పట్టణానికి చెందిన డాక్టర్ శివరామిరెడ్డి, డాక్టర్ పద్మ దంపంతుల కుమారుడు నాగ శశి ప్రణయ్‌రెడ్డి నీట్ పీజీలో 1272 ఆల్ ఇండియా ర్యాంకు సాధించాడు. అలాగే శ్రీనివాసులు కుమారుడు రాజకుమార్ నీట్ పీజీలో 8200 ఆల్‌ఇండియా ర్యాంకుతో ప్రతిభ చాటాడు. ఇరువురిని పలువుర అభినందించారు.

## అధికారులు బాధ్యతగా పని చేయాలి



ఇసుక రీచులను పరిశీలిస్తున్న జేసీ

**సి. బెళగల్, ఆగస్టు 24:** అధికారులు బాధ్యతతో పనిచేయాలని జేసీ నవ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో ఆమె మాటాడారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. సచివాలయాలకు వచ్చిన ప్రజలకు వెంటనే సమాధానం చెప్పాలన్నారు. అనంతరం మండంలోలని ఈర్లదిన్నె, శింగవరం ఇసుక రీచులను పరిశీలించారు. ఉచిత ఇసుకపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇసుక కావాలసిన వారు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకొవచ్చు అన్నారు. జేసీ వెంట ఆర్డీవో శేషిరెడ్డి, తహసీల్దార్ విజయశ్రీ, మైనింగ్ అధికారులు, ఎస్ఐ తిమ్మారెడ్డి తదితరులు ఉన్నారు.

## కుల ధ్రువీకరణపై జేసీ విచారణ

**పెద్దకడుబూరు, ఆగస్టు24:** పెద్దకడుబూరు మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో కులధృవీకరణ పత్రంపై జేసీ నవ్య శనివారం విచారణ చేపట్టారు. గ్రామంలో సుమోటోగా నమోదు చేసుకున్న కుల ధృవీకరణపై గ్రామంలో పర్యటించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులకు జేసీ నవ్య ప్రతి ఇంటికి తిరిగి కుల ధృవీకరణ చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ప్రజలు జేసీని కలిసి తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఆమె వెంట్ సబ్‌కలెక్టర్ విశ్వనాథ్, తహసీల్దార్ శ్రీనాథ్, డీటీ మహేష్, ఆర్ఐ మహేష్, ఎస్ఐ నిరంజన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు

## పత్తి గరిష్ఠ ధర రూ.7,789

**ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 24 :** ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధరలు శనివారం క్వింటం గరిష్ఠంగా రూ.7789 పలికింది. గత పది రోజులుగా పత్తి ధరలు స్థిరంగా ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ పంట ఉత్పత్తులు ఇంకో నెల రోజుల్లో చేతికి వచ్చే అవకాశం ఉంది. పత్తి ధరలు గత సీజన్ నుంచి పెరగకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఈ ఏడాదైనా పత్తి ధరలు పెరిగితే పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీరుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 222 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర క్వింటం రూ.4211, గరిష్ఠ ధర రూ.7789 మధ్యస్థ ధర రూ.7535 పలికింది.

## ఎంఈవో నాగేశప్ప సస్పెన్షన్

**కోసిగి, ఆగస్టు 24:** కోసిగి మండల కేంద్రంలో ఎంఈవో-2గా విధులు నిర్వహిస్తున్న నాగేశప్పను డీఈవో శామ్యూల్ సస్పెండ్ చేశారు. ఎంఈవో-2 నాగేశప్ప విధి నిర్వహణలో అలసత్వం వహించడమే కాకుండా విద్యార్థుల యూనిఫాం అందించడంలో నిర్లక్ష్యం వహించి యూనిఫాంల రవాణా చార్జీలను అందించలేదనే ఉపాధ్యాయుల ఫిర్యాదుతో డీఈవో సస్పెండ్ చేసినట్లు తెలిసింది. అయితే మరికొందరు ఉపాధ్యాయులు ఎంఈవో-2ను సస్పెండ్ చేయడం సరి కాదని నిజనిర్ధారణ చేసుకుని ఎంఈవో2 నాగేశప్ప సస్పెండ్‌ను ఎత్తివేయాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి వినతి పత్రం అందించడం గమనార్హం.

## మహిళ అరెస్టు

**ఆదోని రూరల్ ఆగస్టు 24 :** ఆదోని పట్టణంలోని భవాజీ పేటకు చెందిన బోయ ఈరమ్మను ఇస్పీ పోలీసులు అరెస్టు చేశారు. కర్ణాటక బస్సులో మద్యాన్ని తరలిస్తుండగా శనివారం దాడి చేసి ఆమె నుంచి రెండు బాక్సుల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆమెను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ నాగేంద్ర తెలిపారు.

## 'ఫిర్యాదులపై అలసత్వం వహించొద్దు'


రికార్డులను పరిశీలిస్తున్న మేనేజర్

**కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 24:** నగర పాలక హెల్ప్‌లైన్ ద్వారా వచ్చే ఫిర్యాదులను సంబంధిత విభాగాలకు పంపించడంలో అలసత్వం వహించొద్దని నగర పాలక మేనేజర్ చిన్నిరాముడు అన్నారు. కార్యాలయంలోని ప్రజా ఫిర్యాదులు స్వీకరణ విభాగాన్ని శనివారం మేనేజర్ తనిఖీ చేశారు. గత మూడు నెలలుగా వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నరాముడు మాట్లాడుతూ గడిచిన మూడు నెలల్లో హెల్ప్‌లైన్, వాట్సాప్ ద్వారా మొత్తం 628 సమస్యలు వచ్చాయని, 528 సమస్యలు పరిష్కారం అయ్యాయని అన్నారు. ఇందులో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 352 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రజలు ఏమైనా ఫిర్యాదులుంటే 7422992299 నెంబరుకు ఫోన్/ వాట్సాప్ ద్వారా సమస్యలను తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమంలో విభాగం సిబ్బంది నూరుల్లా, సరస్వతి, నాగమణి పాల్గొన్నారు.

## 'పార్కుల్లో మౌలిక వసతులు కల్పించాలి'

**కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 24:** నగర పాలక సంస్థ పరిధిలోని పార్కుల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని చాణిక్యపురి కాలనీ, వినాయక ఘాట్, గాయత్రీ ఎస్టేట్, కోట్ల రైల్వేస్టేషన్ పక్కనే ఉన్న పార్కులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పార్కుల్లో పిచ్చిమొక్కలు పెరిగి పిల్లలు ఆడుకోవడానికి, పెద్దలు వాకింగ్ చేయడానికి ఇబ్బందిగా మారిందన్నారు. వినాయక ఘాట్ పార్కులో పిచ్చిమొక్కలు ఎక్కువగా పెరగడంతో సందర్శకులు రావడం మానేసారని, రాత్రి సమయంలో మందుబాబులకు అడ్డాగా మారిందని అన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పార్కుల్లో పిచ్చిమొక్కలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు బాబయ్య, బీసన్న, చంటి, సురేంద్ర, శివ పాల్గొన్నారు.

## 'మెరుగైన సేవలు అందించాలి'

**కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 24:** ఉద్యోగులకు మెరుగైన సేవలు అందించాలని మేనేజర్ చిన్నరాముడు ఎస్‌బీఐ బ్యాంకు నగర పాలక బ్రాంచ్ అధికారులకు సూచించారు. శనివారం కార్యాలయంలో ఎస్‌బీఐ బ్రాంచు మేనేజర్ డి.రాజేంద్రరావు నగర పాలక సంస్థ మేనేజర్ చిన్న రాముడును మర్యాదపూర్వకంగా కలిశారు. నగర పాలక సంస్థ ఉద్యోగులకు రుణాలు, సేవలు, ప్రయోజనాలపై వారు చర్చించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామక్రిష్ణ, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి


జాతీయ రహదారిపై విద్యార్థుల మానవహారం

**కర్నూలు(కల్చరల్), ఆగస్టు 24:** కోల్‌కతా వైద్యురాలిని హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎస్ విజయలక్ష్మమ్మ డిమాండ్ చేశారు. శనివారం నగర శివారు, దూపాడులోని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. కళాశాల ప్రిన్సిపాల్ కే కన్నాకుమార్, నాక్ కోఆర్డినేటర్ డాక్టర్ సి.ధనరాజ్, ఉమెన్ ఎంప వర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ కె. గీతావాణి, వివిధ విభాగాల హెచ్ ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపు నృత్య పోటీలు

**కర్నూలు(కల్చరల్), ఆగస్టు 24:** భరతమాత మాతృమండలి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో సోమవారం కృష్ణాష్టమిని పురస్కరించుకొని విద్యార్థులకు నృత్య పోటీలు, చిన్నారులకు శ్రీకృష్ణ, గోపికల వేషధారణ పోటీలు, ఆధ్యాత్మిక వక్తలతో ప్రవచన ప్రసంగాలు ఏర్పాటు చేసినట్లు మాతృమండలి అధ్యక్షురాలు ఇ.పద్మావతి, కార్యదర్శులు పి.జయలక్ష్మి, కె.స్వప్న సారథి తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమీపంలోని సాలమ్మ సత్రం ఆవరణలో ఈ వేడుకలకు సంబంధించిన పోస్టర్లను ఇతర ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటరమణ కాలనీలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణ మంటపంలో ఈ వేడుకలు ఏర్పాటు చేశామన్నారు. నృత్య పోటీలు సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ (6 నుంచి 10వ తరగతి వరకు) మూడు విభాగాల్లో ఉంటాయని తెలిపారు. వివరాలకు ఇ.పద్మావతి సెల్ నెం.94 925 50433, 94944 22433లలో సంప్రదించాలని కోరారు. కార్యక్ర మంలో మాతృమండలి సభ్యులు జి. శ్రీదేవి, పి. మహాలక్ష్మి, ఆర్. అను రాధ, ఎస్.క్రిష్ణవేణి, డి.హేమలత, వీహెచ్‌పీ సీనియర్ నాయకుడు మల్లికార్జునరెడ్డి, ఎస్.భాస్కర్ పాల్గొన్నారు.

## ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

**కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), ఆగస్టు 24:** ఏపీ గృహ నిర్మాణ సంస్థ లో పొరుగు సేవలు, అప్రెంటిస్ పూర్తి చేసిన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వామ నగిరి హనుమన్న ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సంస్థ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత 19 సంవత్సరాలుగా సంస్థలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ అపరేటర్లు, ఏంఐసీలు, అటెండర్లుగా పనిచేస్తున్నామని, అయినా కూడా తమకు ఉద్యోగ భద్రత కరువైందని అన్నారు. రాష్ట్రం మొత్తం మీద దాదాపు 2500 మంది ఉద్యోగులు ఈ రకమైన సేవలు అందిస్తున్నారని, గత వైసీపీ ప్రభుత్వం తమను క్రమబద్ధీకరిస్తామని చెప్పి మాట తప్పిదన్నారు. జిల్లా అధ్యక్షుడు నేనావత్ రాము నాయక్ మాట్లాడుతూ ఇప్పటికే చాలా మంది ఉద్యోగులు పదవీ విరమణ పొంది ఆ స్థానాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని తమతో భర్తీ చేయాలని కోరారు.

## నేత్రదాన పక్షోత్సవాలను విజయవంతం చేయండి

**కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 24:** ఈనెల 25 నుంచి సెప్టెంబరు 8 వరకు జరిగే 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో ఎల్. భాస్కర్ పిలుపునిచ్చారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ రూపొందించిన నేత్రదాన పక్షోత్సవాల ప్రచార పోస్టర్‌ను శనివారం కర్నూలు ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. పృథ్వీ వెంకటేశ్వర్లు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ కార్యదర్శి డా.సంధ్యా రెడ్డి, ప్రొఫెసర్ డా.సత్యనారాయణ రెడ్డితో కలిసి డీఎంహెచ్‌వో ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ నేత్రదానం ఆవశ్యకతపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఆర్ఎంవో డా. భరత్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. నివేదిత, వైద్యు లు ఆప్తాల్మిక్ ఆఫీసర్ పరమేశ్వరరెడ్డి, శివశంకర్ పాల్గొన్నారు.

## మురుగు కాలువలను నిర్మించాలి: సీపీఎం

**కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 24:** లక్ష్మీనగర్, మద్దూర్‌నగర్‌లలో మురుగు కాలువలను నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. శనివారం 24వ వార్డు లక్ష్మీనగర్‌లో సీపీఎం బృందం పర్యటించింది. గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ వార్డులో మురుగునీరు రోడ్లపై వచ్చి నీటికుంటలుగా మారిన అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. చిన్నపాటి వర్షానికి రోడ్లపై నీరు నిలిచి దోమలకు ఆవాసంగా మారిందన్నారు. ప్రజలు డెంగీ, మలేరియా తదితర వ్యాధులతో ఆసుపత్రి పాలవుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, శేషాద్రి, ఎల్ల గుపేర పాల్గొన్నారు.

# నగరంలో మారథాన్ రన్


మారథాన్ పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

**కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 24:** జిల్లా వైద్యఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కోల్స్ కాలేజీ వద్ద మారథాన్ రన్ (5 కి.మీలు) పరుగు పందేన్ని డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్, సెట్కూరు సీఈవో రమణ, డీఎస్‌డీవో భూపతిరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు కాలేజీ విద్యార్థులతో మారథాన్ పరుగు పందెం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుష్టు నివారణ అధికారి డా. మల్లికార్జున రెడ్డి, ఎయిడ్స్ నివారణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జి. వెంకటరత్నం పాల్గొన్నారు.

● **మారథన్ విజేత దివాకర్ :** పురుషుల్లో ఎస్ఆర్ డిగ్రీ కాలేజీకి చెందిన ఏ. దివాకర్ మొదటి బహుమతి (రూ.7వేలు) గెలుచుకోగా, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (పర్‌మెన్)కి చెందిన జి. ప్రసాద్ రెండో బహుమతి (రూ.5వేలు), మహిళల్లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పర్‌మెన్‌కి చెందిన మల్లికార్జున బాయి మొదటి బహుమతి (రూ.7వేలు), రవీంద్ర ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన డి. వెంకటేశ్వరి (రూ.5వేలు) రెండో బహుమతి గెలుచుకున్నారు. ట్రాన్స్‌జెండర్లలో జి.లీలావతి రూ7వేలు మొదటి బహుమతి, జి.కీర్తి (రూ.5వేలు) రెండో బహుమతి గెలుచుకున్నారు.

# విద్యాప్రేరణ బ్రోచర్ విడుదల


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మంత్రి టీజీ భరత్, డాక్టర్ సిరిగిరెడ్డి జయారెడ్డి

**కర్నూలు(కల్చరల్), ఆగస్టు 24:** నగరంలోని మౌర్యఇన్‌లోగల మంత్రి టీజీ భరత్ కార్యాలయంలో హిప్నాటిజం వైద్యుడు డాక్టర్ సిరిగిరెడ్డి జయారెడ్డి నిర్వహిస్తున్న విద్యాప్రేరణ తరగతులకు సంబంధించిన బ్రోచర్లను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తో కలిసి ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో రాణించడానికి మోటివేషన్ తరగతులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఏకాగ్రతా , జ్ఞాపకశక్తి లోపాలతోపాటు మానసిక ఒత్తిడి వల్ల పరీక్షలు అంటే భయపడుతున్నారని అన్నారు. సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా ప్రభావం, చెడు అలవాట్లతోనూ కొందరు చదువుల్లో వెనుకబడి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అలాంటి వారికి డాక్టర్ సిరిగిరెడ్డి జయారెడ్డి మోటివేషన్ క్లాసులు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. డాక్టర్ సిరిగిరెడ్డి జయారెడ్డి మాట్లాడుతూ సెల్ ఫోన్ల వాడకంతో చదువులపై ఒత్తిడి పెరుగుతుందని, వాటిని తగ్గించేందుకు ఈ తరగతులు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కల్లూరు ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు ఎస్‌కే బాషా పాల్గొన్నారు.

## స్టేడియాన్ని అభివృద్ధి చేయాలి

**కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 24:** జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని డీఎస్‌డీవో భూపతిరావు అన్నారు. శనివారం మంత్రి టీజీ భరత్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. స్టేడియంలో 400 మీటర్ల సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలని, ఫుట్‌బాల్ మైదానంలో పచ్చిక మైదానాన్ని ఏర్పాటు చేసినట్ల యితే ఫుట్‌బాలు, రగ్బీ తదితర క్రీడలు ఆడేందుకు అవకాశం ఉంటుందన్నారు. క్రీడాకారులకు వసతి లేదని, సెకండ్ ఫ్లోర్‌లో మరో ఫ్లోర్ నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే వాకర్స్ ట్రాక్, రైఫిల్ షూటింగ్, అర్చరీకి మున్సిపల్ కార్పొ రేషన్‌లో ఉండే ప్యాకెట్ పార్కులకు కేటాయించాల్సిందిగా ఆయనను విజ్ఞప్తి చేశారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో పది కేసులు నమోదు

**కర్నూలు, ఆగస్టు 24:** నగరంలో ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి పది డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఉల్చాల రోడ్డు సర్కిల్‌లో ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఎనిమిది బైక్‌లు, ఇద్దరు ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. వాహనాలను స్వాధీనం చేసుకుని వీరిని కోర్టులో హాజరురుస్తామని సీఐ తెలిపారు.

# అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం: గౌరు చరిత


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

**కల్లూరు, ఆగస్టు 24:** ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్క నాటాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పిలుపునిచ్చారు. శనివారం స్పార్టన్ గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో 21వ వార్డు పార్థసారథినగర్ పార్క్‌లో నిర్వహించిన తల్లి పేరుతో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే భాష్యం స్కూల్ విద్యార్థుల తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి కోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కె. పార్వతమ్మ, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, స్పార్టన్ గ్రీన్ సంస్థ అధ్యక్షుడు సయిం, చరిత, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణాష్టమి


కృష్ణ గోపికల వేషధారణలో చిన్నారులు

**కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 24:** కృష్ణానగర్‌లోని సర్వేపల్లి పాఠశాలలో శనివారం కృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ పి.శేషన్న ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణుడు మానవుడై జన్మించి మాధవుడిగా, జగద్గురువుగా భగవద్గీతను బోధించి ధర్మ రక్షణ కోసం కృషి చేశారన్నారు. అనంతరం చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో హెచ్ఎం అరుణశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కల్లూరు:** మాధవి నగర్‌లోని నారాయణ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమిని ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి విశిష్టతను చిన్నారులకు ప్రిన్సిపాల్ వివరించారు. అనంతరం పాఠశాలలో చిన్నారులు ఉట్టి కొట్టడానికి పోటీ పడ్డారు. చిన్నారులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో అల రించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరి, రాధ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## షాదీఖానాలకు నిధులు కేటాయించండి


మంత్రి ఫరూక్‌కు సమస్యలను వివరిస్తున్న మల్లెల రాజశేఖర్

**ఓర్వకల్లు, ఆగస్టు 24:** మండలంలో షాదీఖానా నిర్మాణాలకు నిధులు కేటాయించాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. శనివారం నంద్యాల పట్టణంలోని మంత్రి నివాసంలో ఆయన్ను రాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు. హుస్సేనాపురంలో షాదీఖానా నిర్మాణానికి గత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిధులు మంజూరు చేశారని, అప్పటి ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తితో భూమి పూజ చేశారన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో షాదీఖానా నిర్మాణాల గురించి పట్టించుకోలేదన్నారు. హుస్సేనాపురం, కాల్వ గ్రామాల్లో షాదీఖానా నిర్మాణాలకు నిధులు కేటాయించాలని మంత్రిని కోరగా స్పందించిన మంత్రి ఫరూక్ నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## ఆర్‌యూ అభివృద్ధికి సహకరించండి

**కర్నూలు(అర్బన్), ఆగస్టు 24:** రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి సహకరించాలని ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ కోరారు. శనివారం ఉపకులపతి ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ వెంక టేశ్వర్లు మంత్రి టీజీ భరత్‌ను కలిసి విన్నవించారు. నగర పాలక సంస్థ నుంచి తాగునీటి సరఫరా గురించి మంత్రికి వివరించారు. విద్యార్థులు, ఉద్యోగుల సౌకర్యార్థం హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలని, రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగుల జీతాల విషయాన్ని పరిష్కరించాలని మంత్రిని కోరారు.

## సెక్యూరిటీ గార్డుల సస్పెన్షన్

**కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 24:** విధుల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు సెక్యూరిటీ గార్డులను పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ సస్పెండ్ చేశారు. ఎమర్జెన్సీ విభాగానికి వచ్చే రోగులపై ముగ్గురు సెక్యూరిటీగార్డులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సూపరింటెండెంట్ శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీ కెమెరాల ద్వారా సూపరింటెండెంట్ పర్యవేక్షణ చేసి బాధ్యులైన సెక్యూరిటీ సిబ్బంది కృపాకర్, షేక్షావలి, కుమార్‌లను ఐదు రోజులపాటు సస్పెన్షన్ చేస్తూ ఎక్స్‌పర్ట్ సెక్యూరిటీ ఏజెన్సీకి ఆదేశాలు జారీ చేశారు. అలాగే మధ్యాహ్నం రెండు గంటల సమయంలో క్యాజువాల్టీ వద్ద అంబులెన్సులో వచ్చిన క్షతగాత్రుడు అక్కడ కుప్పకూలిపోయాడు. ఈ విషయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ సీసీ కెమెరాల ద్వారా చూశారు. తక్షణమే రోగికి స్ట్రెచ్చర్ పంపించి క్యాజువాల్టీలోకి చేర్పించి చికిత్స అందేలా చూశారు.

## హెచ్ఐవీపై అవగాహన సదస్సు

**కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 24:** జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ విభాగం విజయ మహిళా మండలి ఆధ్వర్యంలో శనివారం నగరంలోని గీతాంజలి నర్సింగ్ కాలేజీలో హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం జరిగింది. సీపీఎం వెంకటరత్నం, ప్రాజెక్టు మేనేజర్ శివకుమార్ మాట్లాడుతూ హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నేస్తం అధ్యక్షురాలు సుధారాణి పాల్గొన్నారు.

**నిరుపేదలకు కంటి ఆపరేషన్లు:** నగరంలోని రోజావీధికి చెందిన పేదలకు సుశీల నేత్రాలయ అధినేత డాక్టర్ పి.సుధాకర్ రావు శనివారం ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. కాలనీకి చెందిన సుమలత ఆయన్ను సన్మానించారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**కర్నూలు(కల్చరల్), ఆగస్టు 24:** విద్యార్థులు వ్యక్తిత్వ వికాస శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. శనివారం నగరంలోని ఏపీ ఎస్పీ బెటాలియన్‌లోని కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగర పాలక ఉన్నత పాఠశాల్లో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస ట్రైనర్లు గోపీనాథ్, మహేంద్రలు శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాస శిక్షణల ద్వారా పరీక్షల్లో విద్యార్థులకు విజయ అవకాశాలు పెరుగుతాయన్నారు. హెచ్ఎం టి.వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రెమ్యునరేషన్ పెంచి ఇవ్వాలి

**కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 24:** ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్మీడియట్ అభ్యర్థులకు విద్యను బోధించే అధ్యాపకులకు రెమ్యునరేషన్ పెంచి ఇవ్వాలని నంద్యాల జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి కొట్టె చెన్నయ్య కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ చాలీచాలని రెమ్యునరేషన్‌తో పాఠాలు బోధించడానికి అధ్యాపకులు ముందుకు రావడం లేదన్నారు. ఒక్క పీరియడ్‌కు రూ.300 ఇవ్వాలని, అది కూడా రెగ్యులర్‌గా చెల్లించాలన్నారు.

**పాఠశాలపై చర్యలు తీసుకోవాలి:** లక్ష్మీపురం సమీపంలోని ఎడిఫై పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పీఎస్‌యూ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. శనివారం అగ్నిమాపక శాఖ అధికారిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అయ్యన్న, కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ నిబంధనలను తుంగలో తొక్కి పెట్రోల్ బంకు సమీపంలో పాఠశాలను నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు విష్ణు, వేణు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్లు

**ఓర్వకల్లు, ఆగస్టు 24:** ఓర్వకల్లు నూతన తహసీల్దార్ వెంకటరమణను శనివారం మండల రేషన్ల డీలర్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులుతోపాటు డీలర్లు మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చి సన్మానించారు. కార్యక్రమంలో డీలర్లు రామిరెడ్డి, రాజగోపాల్ రెడ్డి, శేఖర్, మౌలాలి, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

# మండలాన్ని అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే దస్తగిరి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

**గూడూరు ఆగస్టు 24:** అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఎంపీపీ సునీత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దస్తగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో విజయసింహారెడ్డి, ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● **ఎమ్మెల్యేకు సన్మానం:** గూడూరులో పర్యటించేందుకు వచ్చిన ఎమ్మెల్యే దస్తగిరికి టీడీపీ నాయకులు స్వాగతం పలికి పూలమాలలు వేసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ నగర పంచాయతీ వైస్ చైర్మన్ కే.రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్రగోపాల్ నాయుడు, టీడీపీ నాయకులు రేమట వెంకటేశ్వర్లు, సృజన్, పౌలు, చాంద్‌బాషా, దానమయ్య పాల్గొన్నారు.

## విచారణ జరపాలి

**కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 24:** సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల విద్యార్థిని కీర్తి ఆత్మహత్యాయత్నంపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న డిమాండ్ చేశారు. ఆర్ఐవో కార్యాలయంలో ఏవోకు ఏఐఎస్ఎఫ్ నాయకులు శనివారం వినతి పత్రం సమర్పించారు. సోమన్న మాట్లాడుతూ కీర్తి ఆత్మహత్యాయత్నంపై సమగ్ర విచారణ జరిపిస్తే వాస్తవాలు బయటికి వస్తాయన్నారు. తమ అసమర్థతను కప్పి పుచ్చుకునేందుకు కళాశాల యజమాన్యం విద్యార్థినిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఏఐఎస్ఎఫ్ నగర కోశాధికారి అశోక్, అబీ, అర్జున్, వర్ధన్ ఉన్నారు.

## చెత్త సేకరణ కేంద్రాల పరిశీలన

**సి.బెళగల్, ఆగస్టు 24:** మండంలోని కొత్తకోట, ఈర్లదిన్నె, ముడుమాల గ్రామాల్లోని చెత్త సేకరణ కేంద్రాలను ఎంపీడీవో రాముడు శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని పంచాయతీ కార్యర్శులు, సర్పంచ్‌లకు ఆదేశించారు.

## ఆ వివరాలు యాప్‌లో నమోదు చేయాలి

**కల్లూరు, ఆగస్టు 24:** పతి బుధ, శుక్రవారాల్లో ఎస్ఎంసీ కమిటీ, సోమ, గురువారాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్స్ ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి పరిసరాలు, శుభ్రత, నీరు మొదలైన వివరాలు ఐఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎస్ఎంసీ, సీఆర్పీ, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు ఆయన అవగాహన కల్పించారు. ఈవోఆర్డీ రవికిషోర్, ఎంఈవో శ్రీనివాసులు, వనజ కుమారి పాల్గొన్నారు.


## పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

**కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 24:** విధుల్లో నిర్లక్ష్యం వహించిన కౌతాళం మండలం కుంటనహాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-4 జీ.నగేష్ సస్పెండ్ అయ్యారు. నగేష్ రికార్డులు సరిగా నిర్వహించకపోవడం కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు సస్పెండ్ చేశారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

**కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 24:** ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ కర్నూలు జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పి.మోహన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంటు మణిరత్నం, జనరల్ సెక్రటరీ మార్కెండేయులు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎ.నాగఎల్లప్ప, జనరల్ సెక్రటరీగా విశ్వేశ్వరయ్య, కోశాధికారిగా పరమేశ్వర రెడ్డిలను ఎన్నుకున్నారు. తమను ఎన్నుకున్న ఏపీ మోడల్ స్కూల్స్ పీజీటీ ఉపాధ్యాయులకు వారు అభినందనలు తెలిపారు.

## డిగ్రీ కళాశాలను విస్మరించిన నేతలు


మాట్లాడుతున్న శ్రీరాములుగౌడ్

**కోడుమూరు, ఆగస్టు 24:** ఎన్నికల ముందు విద్యార్థుల కోసం డిగ్రీ కళాశాల నిర్మిస్తామని చెప్పిన నేతలు గెలిచిన తర్వాత దాన్ని విస్మరిస్తున్నారని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీరాములుగౌడ్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నాయ కులు రంగస్వామి, వీరాంజనేయులు, అల్తాఫ్, మహమ్మద్ అజామ్, విశ్వనాథ్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనం అందించండి: పీడీ


హస్టల్‌లో నిత్యావసర సరుకులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

**ఓర్వకల్లు, ఆగస్టు 24:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డ్వామా పీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ అమర్నాథ్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మీదివేములలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులను, వంట గదిని, స్టాక్ రూమ్, బాత్ రూములను పరిశీలించారు. వసతి గృహంలో నీరు వృథా కాకుండా కొళాయిలను ఏర్పాటు చేయాలని, రూముల్లో స్విచ్ బోర్డులు మరమ్మతు చేయించాలని ఆయన వార్డెన్‌ను ఆదేశించారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట వార్డెన్ రాఘవేంద్ర, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసు, ఏపీవో కుమారసాయినాథ్, ఈసీ వెంకటభూపాల్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

## క్రీడలతో స్నేహ భావం

**కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 24:** క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. డీఎస్ఏ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అంతర్ పాఠశాలల బాలబాలికలకు క్రీడా పోటీలను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, సెట్కూరు సీఈవో రమణ న్యాయవాది శ్రీధర్ రెడ్డి, రగ్బీ సంఘం నాయకుడు రామాంజేయులు, దాసరి సుధీర్ పాల్గొన్నారు.

## పీజీ, డిగ్రీ ఫలితాలను విడుదల చేయాలి

**కర్నూలు(అర్బన్), ఆగస్టు 24:** రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని పీజీ, డిగ్రీ రీవాల్యుయేషన్ ఫలితాలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీలో ఆయన మాట్లాడుతూ పీజీ కౌన్సెలింగ్ ప్రారంభమైనప్పటికీ ఇంకా డిగ్రీ ఫలితాలు విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. నాయకులు మౌలాలి, సందీప్ నాయక్, గణేష్, అమర్, దేవేంద్ర, ప్రకాష్, పవన్, గౌస్, నాగరాజు పాల్గొన్నారు.

## రోడ్డును బాగు చేయండి

**కల్లూరు, ఆగస్టు 24:** కల్లూరు మండలం అయ్యవారి నాగలాపురం రోడ్డును బాగు చేయాలని గ్రామస్థులు కోరారు. ఈసం దర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గోడౌన్‌కు వెళ్లే భారీ వాహనాలు తిరిగి రోడ్డు అధ్వానంగా తయారైందన్నారు. వాహనదారులు కిందపడి గాయపడుతున్నారన్నారు. గోడౌన్ యాజమాన్యానికి చాలాసార్లు రోడ్డు వేయించాలని తెలిపినా స్పందించకపోవడంతో శనివారం గ్రామస్థులు లారీలు వెళ్లకుండా రోడ్డు తవ్వి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థులకు సర్దిచెప్పారు. గోడౌన్ యాజమాన్యంతో చర్చించి సమస్య పరిష్కరించుకోవాలన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక వాయిదా

**కర్నూలు, ఆగస్టు 24:** జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఎస్పీ జి.బిందు మాధవ్ శనివారం తెలిపారు. సోమవారం జరిగే కృష్ణాష్టమి సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

## వసతి గృహం పరిశీలన

**కర్నూలు(న్యూసిటీ ), ఆగస్టు 24:** నగరంలోని కృష్ణానగర్ వద్ద ఉన్న ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల హాస్టల్‌ను శనివారం సాయంత్రం నగర పాలక కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ పరిశీలించారు. అక్కడ అవసరమైన వసతులు, అభివృద్ధి పనులు, పారిశుధ్యం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు.

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

# సీఎం ఫొటో ఎందుకు పెట్టలేదు?

● మండల మీట్‌లో ఎంపీపీ, అధికారుల తీరుపై మండిపడ్డ టీడీపీ ఎంపీటీసీలు

● మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన ప్రజాప్రతినిధులు

**పత్తికొండ టౌన్, ఆగస్టు 23:** మండల సర్వసభ్య సమావేశంలో ఏర్పాటు చేసిన బ్యానర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోను ఎందుకు ముద్రించలేదంటూ శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో టీడీపీ చక్రాళ్ల, పుచ్చకాయలమాడ గ్రామాల ఎంపీటీసీలు రాజు, చంద్ర ఎంపీపీ, ఇటు ప్రజాప్రతినిధుల తీరుపై మండిపడుతూ సమావేశాన్ని బహిష్కరించారు. శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ నారాయణదాసు అధ్యక్షతన మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ప్రారంభమైంది. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు హాజరు కాగా, వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంలోనే చక్రాళ్ల, పుచ్చకాయల మాడ టీడీపీ ఎంపీటీసీలు, రాజు చంద్ర ఒక్కసారిగా లేచి నిల్చుండి ఎంపీపీ దగ్గరకు వెళ్లి కూటమి ప్రభుత్వం వచ్చి మూడు నెలలు పూర్తవుతున్నా ఇంత వరకు సచివాలయాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫొటోలు పెట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బలరాముడు, కోఆప్షన్ సభ్యులు నజీర్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎంపీపీని ప్రశ్నిస్తున్న టీడీపీ ఎంపీటీసీలు రాజు, చంద్ర

## పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవాలి

**ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 24:** గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు పార్టీలకతీతంగా పరిష్కరించుకొని అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ కేశన్న కోరారు. శనివారం స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో ఎంపీడీవో బంగారమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ కేశన్న, ఎంపీడీవో బంగారమ్మ మాట్లాడారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి ఏవైనా సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. తాగునీరు, డ్రైనేజీ, వీధిదీపాలు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పంట నమోదు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఏడీఏ అరుణకుమారి

**పెద్దకడుబూరు, ఆగస్టు24:** మండలంలోని ఆయా గ్రామాల్లో వ్యవసాయ అధికారులు పంట నమోదును వేగవంతం చేయాలని ఏడీఏ అరుణకుమారి తెలిపారు. శనివారం పెద్దకడుబూరులోని రైతు భరోసా కేంద్రంలో అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 15వ తేదీలోపు పంట నమోదు, రైతులతో ఈకేవైసీ పూర్తి చేయాలని తెలిపారు. హనుమాపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రం సిబ్బందితో పంటనమోదు, పంటకోత ప్రయోగాలపై సమావేశం నిర్వహించారు. పంట కోత ప్రయోగాలపై వ్యవసాయ సహాయకులు జాగ్రత్త వహించాలన్నారు. ఏవో వరప్రసాద్, ఏఎస్‌ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## బీసీ బాలుర హాస్టల్ ఏర్పాటు చేయాలి

**గోనెగండ్ల, ఆగస్టు 24:** గోనెగండ్లలో బీసీ బాలుర హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు రాయలసీమ విద్యార్థి సంఘం నాయకులు పాండు, నాగరాజు వినతి పత్రం అందజేశారు. గోనెగండ్లలో మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలో దాదాపు 2500 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఎంపీ నాగరాజు సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కాలర్‌షిప్పుల పంపిణీ



విద్యార్థులతో అధికారులు, ఉపాధ్యాయులు

**మంత్రాలయం, ఆగస్టు 24:** మంత్రాలయం మండలంలోని తుంగభద్ర జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన పది మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు పంపిణీ చేశారు. శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో, పీఎల్‌జీ కృష్ణారెడ్డి, బయోజైమ్ ప్రగతి స్కాలర్‌షిప్పులను అందించారు. బయోస్టాండ్ ఇండియా లిమిటెడ్ రీజనల్ మేనేజర్ వరప్రసాదరావు, సీనియర్ ఎఎస్‌ఎంటీ వేణుగోపాల్ రెడ్డి, సేల్స్ ఆఫీసర్ రఘు ఒక్కో విద్యార్థికి రూ.2,500 ప్రకారం రూ.25వేల నగదును అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో అధిక మార్కులు ఉత్తీర్ణత సాధిస్తే తమ కంపెనీ నుంచి ప్రగతి స్కాలర్‌షిప్పులను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బి. రవికుమార్, హుశేన్, ఎం. రవికుమార్, బాలచంద్రుడు పాల్గొన్నారు.

## బాలుర హాస్టల్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర వర్మ

**వెల్దుర్తి, ఆగష్టు, 24:** పట్టణంలో ప్రభుత్వ బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని తహసీల్దార్ చంద్రశేఖర వర్మ శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వంట గది, హాస్టల్ పరిసరాలను, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. హాస్టల్‌లో అందిస్తున్న వసతులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. క్రమంలో ఆర్ఐ మస్తాన్, వార్డెన్ ఉస్మాన్ ఉన్నారు.

## ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

**ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు24:** ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ మైత్రేయిపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజీవ్ డిమాండ్ చేశారు. శనివారం వైద్యురాలిపై చర్యలు తీసుకోని డీఎంఅండ్ హెచ్‌వో-డీసీహెచ్‌ఎస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో సూపరింటెండెంట్‌గా విధులకు హాజరు కాకుండా దుమ్మా కొడుతూ ప్రైవేటు క్లినిక్‌కే పరిమితమైన మైత్రేయిపై ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. డాక్టర్ మైత్రేయి నిర్లక్ష్యం వల్ల నవజాత శిశువు ప్రాణం పోయినా వైద్య ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. వైద్యురాలిపై చర్యలు తీసుకోకపోతే బాధితులతో కలిసి కలెక్టరేట్ ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్, సందీప్, యేసురాజు, బేరుసలేం, ఇమానియేల్ పాల్గొన్నారు.





## కుంటనహాల్ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

**కౌతాళం, ఆగస్టు 24:** కుంటనహాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న నాగేష్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు రావడంతో కలెక్టర్ రంజిత్‌బాషా నగేష్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

## సీఐను కలిసిన టీడీపీ నాయకుడు

**నందవరం, ఆగస్టు 24:** ఎమ్మిగనూరు తాలుకా సీఐ విక్రమ్ సింహాను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేశాయి మాదవరావు శనివారం కలిశారు. గ్రామాల్లో గొడవలకు తావు లేకుండా ప్రశాంత జీవితం కొనసాగించాలని సీఐను కోరారు.

## నవోదయ విద్యాలయాన్ని సందర్శించిన ఎంపీ

**ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 24:** ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి నవోదయ విద్యాలయాన్ని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు శనివారం సందర్శించారు. ఈయనకు విద్యాలయం వైస్ ప్రిన్సిపాల్ చందిరన్, విద్యార్థులు, అధ్యాపక బృందం ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా వైస్ ప్రిన్సిపాల్ చందిరన్‌ను విద్యాలయంలో ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యాలయంలోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు చెప్పారు. ఆయన వెంట తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, ఆదోని మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ దేవేంద్రప్ప, వెంకటరాముడు, సుధాకర్, వీరేష్ పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాల పనుల పరిశీలన



మెడికల్ కళాశాల పనులకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

**ఆదోని, ఆగస్టు 24 :** ఆదోని మండలం నాగలాపురం వద్ద నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు శనివారం పరిశీలించారు. మెడికల్ కళాశాల పనుల పురోగతిపై ఇంజనీర్లతో చర్చించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరాములు, ఆర్ఎంవో డాక్టర్ జగదీష్ కలసి మెడికల్ కళాశాల వివరాలను ఎంపీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సోమన్న, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మాన్వి దేవేంద్రప్ప, బీసీ సాధికారిక కమిటీ డైరెక్టర్ సాగి మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పనులను త్వరగతిన పూర్తి చేయాలి

**ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 24 :** ఆదోని పట్టణ శివారు ప్రాంతంలోని అరేకల్లు గ్రామం వద్ద నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులను త్వరిగతిన పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. శనివారం మెడికల్ కళాశాల పనులను పరిశీలించేందుకు వచ్చిన ఎంపీ బస్తి నాగరాజును కలిసి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు.

## పత్తికొండ డీఎస్పీగా వెంకట్రామయ్య



**పత్తికొండ టౌన్, ఆగస్టు 23:** పత్తికొండ డివిజన్ డీఎస్పీగా వెంకట్రామయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఉన్నతాధికారుల బదిలీల్లో భాగంగా డీజీపీ కార్యాలయం నుంచి పత్తికొండ డీఎస్పీగా వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని వెయిటింగ్‌లో ఉంచారు. డీఎస్పీ మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

## పాఠశాలకు మరమ్మతులు చేయించండి



జొన్నగిరి ఎంపీయూపీ స్కూల్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

**తుగ్గలి, ఆగస్టు 24:** చిన్నపాటి వర్షానికే పాఠశాల పైకప్పు నుంచి నీరు కారుతుందని, పాఠశాలకు మరమ్మతులు చేపట్టాలని విద్యాకమిటీ చైర్మన్లు రవికుమార్ యాదవ్, లక్ష్మన్న ఎంపీడీవోను కోరారు. శనివారం జొన్నగిరి ఎంపీయూపీఎస్ పాఠశాలను ఎంపీడీవో సావిత్రమ్మ పరిశీలించారు. పాఠశాలలో మూడు గదులు నీరు కారుతుండడంతో పాటు గోడలకు కూడా బీటలు ఏర్పడి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. పాఠశాల నూతన భవన నిర్మాణాలకు కృషి చేస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంటు పులికొండ, జయచంద్ర, అంజి ఉన్నారు.

## ఇసుక రీచ్‌ను పరిశీలించిన జాయింట్ కలెక్టర్



రీచ్ వివరాలను తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్

**కౌతాళం, ఆగస్టు 24:** మండల పరిధిలోని గుడికంబాలి ఇసుక రీచ్‌ను శనివారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇసుక డంప్ చేసిన చోట ఇంకా ఇంద వంద టన్నులకు పైగా ఉందని తెలిపారు. ఈ ఇసుకను ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకుగానీ పేదల ఇళ్ల నిర్మాణానికి గాని తక్కువ ధరకు అందించాలని తహసీల్దార్ మల్లికార్జునస్వామికి ఆదేశించారు. ఇసుక రీచ్‌లలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం డంపింగ్ చార్జీలు చెల్లించి రవాణా చేసుకోవాలని తెలిపారు. వీరి వెంట ఆదోని ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ విశ్వనాథ, మైనింగ్ డీఈ రాజశేఖర్, తహసీల్దార్ మల్లికార్జున స్వామి ఉన్నారు.

## మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు

**పెద్దకడుబూరు, ఆగస్టు 24:** గ్రామంలో ఎవరైనా మహిళలు, చిన్న పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో ప్రజలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని మహిళలు, చిన్న పిల్లల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తమ దృష్టికి వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## ఉత్సవాల్లో 300 మంది పేద కుటుంబాలకు వసతి

● అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి



మాట్లాడుతున్న అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి

**మంత్రాలయం, ఆగస్టు 24:** మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353 సప్తరాత్రోత్సవాల్లో 300 పేదల కుటుంబాలకు వసతులు కల్పించినట్లు అసిస్టెంట్ మేనేజర్, సీఆర్‌వో ఐపీ నరసింహమూర్తి తెలిపారు. శనివారం ముగింపు సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ సీఆర్‌వో ఏలో 400 గదులు, బీలో 410, సీలో 424 గదులు ఉండగా.. ఈ గదులన్నీ నిర్మించిన దాతలకు కేటాయించినప్పటికీ మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు సీఆర్వో ఆఫీసుల్లో 300 మంది పేద కుటుంబాలకు వసతి కల్పించినట్లు తెలిపారు. గదుల కొరత తగ్గించేందుకు 24 గంటలు పని చేశామని, అనేక మంది భక్తులు వసతులపై సంతోషం వ్యక్తం చేశారని అన్నారు.

## ఇంజనీర్‌ను అభినందించిన సుప్రీంకోర్టు జడ్జి

- హర్షించిన పోస్టల్ కాలనీ వాసులు



సుప్రీంకోర్టు జడ్జితో ఆదోని ఇంజనీర్

**ఆదోని రూరల్ ఆగస్టు 24 :** ఆదోని యువ సివిల్ ఇంజనీర్ యార్లగడ్డ రవిచంద్రను సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి. నాగరత్నమ్మ అభినందించారు. బెంగుళూరులోని కర్ణాటక జుడీషియల్ అకాడమి సిల్వ ర్ జూబ్లీ కార్యక్రమంలో న్యాయమూర్తి ఇంజనీర్ రవి చంద్ర మెచ్చుకున్నట్లు శనివారం కాలనీ వాసులు తెలిపారు. పట్టణంలోని పోస్టల్ కాలనీకి చెందిన యార్లగడ్డ రవిచంద్ర ఎం.టెక్ స్ట్రక్చరల్ సివిల్ ఇంజనీర్. ఈయన బిఎస్సార్ ఇన్‌ఫ్రాటెక్ ఆధ్వర్యంలో కర్ణాటక ప్రభుత్వం ఆదేశాల మేరకు హైకోర్టు, డిస్ట్రిక్, తాలుక జడ్జిల ట్రైనింగ్ జుడీషియల్ అకాడమీ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి రవిచంద్రను మెచ్చుకున్నారు.

## తుంగభద్రలో వైభవంగా మహా రథోత్సవం



ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న మఠం అధికారులు

**మంత్రాలయం, ఆగస్టు 24:** మంత్రాయలం రాఘవేంద్రస్వామి మఠం బ్రాంచ్ అయిన తుంగభద్రలో రాఘవేంద్రస్వామి మహారథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ముగింపు రోజైన శనివారం తుంగభద్రకు చేరుకున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు.. ఉభయ పీఠాధిపతులకు అక్కడి మేనేజర్ పురిడి నాగేషాచార్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణాలు, మంగళవాయిద్యాల మధ్య ప్రహ్లాదరాయలను పూజలు చేసి మహారథోత్సవంపై అధిష్టించి పీఠాధిపతుల మహా మంగళ హారతులతో మహారథం ముందుకు సాగింది. కార్యక్రమంలో విచారణకర్త రంగనాథరావు, రాఘవేంద్రాచార్, ప్రకాశాచార్, కృష్ణారెడ్డి, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వైభవంగా పంటల దేవుని పల్లకోత్సవం

**దేవనకొండ, ఆగస్టు 24 :** శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా నల్లచెలిమల గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి పల్లకోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం నుండి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంటల భవిష్యత్తుని సూచించే మూడు గన్నేరు పూల దండలను అశ్వంపై ఆలయానికి తీసుకొచ్చారు. పూల దండలు వచ్చే విధానంతో ఎరుపు, తెలుపు, నల్లటి రేగడి భూములలో పంటల పండే విధానం తెలియజేస్తుందని భక్తులు నమ్ముతారు.

## ఉల్లి పంటపై జాగ్రత్తగా ఉండాలి

**మద్దికెర, ఆగస్టు 24 :** మండలంలో వ్యవసాయ తోటలు, పైరు పొలాల్లో సాగు చేసిన ఉల్లి పంటలో తెగుళ్ల సోకకుండా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారి ఉప్పర రవి కోరారు. శుక్రవారం మండలంలోని ఎడవలి గ్రామంలో ఉల్లి పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తము సాగు చేసిన ఉల్లి పంటల్లో తెగుళ్లను నివారించడానికి వ్యవసాయ శాఖ అధికారి సలహాసూచనలు తీసుకోవాలని సూచించారు.

## మంచి భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో -2 గోపాల్

**మద్దికెర, ఆగస్టు 24 :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మంచి భోజనం అందించాలని ఎంఈవో-2 గోపాల్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు దేవేంద్రప్ప ఉన్నారు.

## శ్రీకృష్ణాష్టమి వేడుకలకు అనుమతులు ఇవ్వాలి



పోలీసులకు వినతి పత్రం ఇస్తున్న త్రైత సిద్ధాంత సభ్యులు

**తుగ్గలి, ఆగస్టు 24:** శ్రీకృష్ణాష్టమి వేడుకలకు అనుమతులు ఇవ్వాలని త్రైత్త సిద్ధాంత ప్రబోధానంద సభ్యుడుమీసాల సురేష్ కోరారు. శనివారం మండల పరిధిలోని జొన్నగిరిలో ఈనెల 26న శ్రీకృష్ణాష్టమి వేడుకలను జరుపుకోవడానికి అనుమతులు ఇవ్వాలని ఏఎస్ఐ రంగస్వామికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 26న జొన్నగిరి మెయిన్‌బజారులో శ్రీకృష్ణుని విగ్రహం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, అలాగే స్వామివారిని దర్శించుకున్న వారికి తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేస్తామన్నారు. సెప్టెంబరు 9న స్వామివారిని ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో త్రైత్త సిద్ధాంత సభ్యులు అశోక్, దేవేంద్ర, శేఖర్, రంగస్వామి తదితరులు ఉన్నారు.

## అర్హులందరికీ పట్టాలిస్తాం



స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శివరాముడు

**ఆదోని రూరల్ ఆగస్టు 24 :** అర్హులైన వారందరికీ పట్టాలిస్తామని తహసీల్దార్ శివరాముడు అన్నారు. శనివారం మండలం 104 బసాపురంలో తహసీల్దార్ మాట్లాడుతూ 20, 21, 64 సర్వేలో దాదాపు 7 ఎకరాల ప్రభుత్వ భూమిలో దాదాపు 300 కుటుంబాలు గత 30 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారని, వారికి పట్టాలు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబును టీడీపీ సీనియర్ నాయకుడు బసాపురం వెంకటేశులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ సూచనలతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ గ్రామంలో పర్యటించినట్లు తెలిపారు. అర్హులైన వారందరికీ పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు.

## ఘనంగా బిందె సేవ ఉత్సవం



బిందు సేవతో పాదయాత్ర

**ఆలూరు రూరల్, ఆగస్టు 24 :** మండల పరిధిలోని మొలగవల్లి గ్రామ సమీపంలో వెలసిన గిడ్డ ఆంజనేయ స్వామి తనువు బిందె సేవ ఉత్సవంను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం ముడవ శనివారం ఉదయం స్వామి వారికి గంగిపూజ, పంచామృతశేకం,మహమంగళ హారతి వంటి ప్రత్యేక పూజలను చేశారు. సాయంత్రం చెన్నకేశవ్ స్వామి ఆలయం నుచి భక్తులు ఊరేగింపుగా ఆంజనేయ స్వామి తనువు బిందె సేవ ఉత్సవాన్ని ఆలయం వరకు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ నర్సింహులు, ఆలయ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

**హాలహర్వి:** సరిహద్దుల్లో వెలసిన చత్రుగుడి ఆంజనేయ స్వామి ఉత్సవం వైభవంగా జరిగింది. శ్రావణ మాసం మూడో శనివారం సాంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## రణమండల ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు

**ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 24 :** ఆదోని పట్టణ శివారు ప్రాంతంలోని రణమండల కొండపై వెలసిన ఆంజనేయుడికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రావణమాసం మూడో శనివారం కావడంతో స్వామివారికి ఉదయమే సింధూర లేపనం, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు నిర్వహించారు.

## ఆలయ ఉత్సవాలకు విరాళం



రూ.50 వేలు విరాళం ఇస్తున్న గుంతకల్ ఎమ్మెల్యే జయరాం

**ఆలూరు, ఆగస్టు 24 :** ఆలూరు పట్టణంలోని సిద్ధలింగేశ్వర స్వామి ఆలయ ఉత్సవాలకు మాజీ మంత్రి గుంతకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం శనివారం రూ. 50వేలు విరాళంగా అందించారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో నాల్గవ సోమవారం జరిగే రతోత్సవంకు హాజరు కావాలని ఆలయ నిర్వాహకులు ఆయనను ఆహ్వానించారు.

## పుస్తకాల పంపిణీ

**ఆదోని టౌన్, ఆగస్టు 24 :** ఆర్య వైశ్య ఆఫిషయల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) వ్యవస్థాపకుడు కే ఆర్ కృష్ణయ్య 40వ వర్ధంతి సందర్భంగా స్థానిక వాసవి కల్యాణ మంటపంలో సంస్థ సభ్యులు శనివారం ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా, డైమండ్ రఘు, యతగిరి వెంకటేష్, మహిళా విభాగ్ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు మమతశ్రీ, గీత పాల్గొన్నారు.

## రణమండల కొండకు ఉచిత బస్సు సౌకర్యం

**ఆదోని, ఆగస్టు 24 :** ఆదోని పట్టణ శివారున ఉన్న రణమండల ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు తెలుగు యువత నాయకులు మారుతి నాయుడు తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా ప్రతిరోజు వందలాది మంది భక్తులు ఆంజనేయ స్వామి దర్శనార్థం కోసం వెళ్తుండడంతో పాటు నడవలేని పరిస్థితుల్లో ఉన్న వారికి ప్రత్యేకంగా ఈ బస్సు సౌకర్యాన్ని కలిపిస్తున్నట్లు తెలిపారు. తన సొంత ఖర్చులతో బస్సులను ఏర్పాటు చేసినట్లు మారుతి నాయుడు తెలిపారు.

## పారిశుధ్య సమస్యను పరిష్కరించండి

**ఎమ్మిగనూరు రూరల్ ,ఆగస్టు24:** మండలంలోని గార్లదిన్నె గ్రామంలో నెలకొన్న పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు రాజీవ్, తిమ్మగురుడులు డిమాండ్ చేశారు. శనివారం గ్రామంలో పర్యటించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య సమస్యలతో పాటు తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయన్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్లు బురదమయంగా మారి నడిచేందుకు కూడా రావడంలేదన్నారు. పంచాయతీ నిధులు వస్తున్నప్పటికి ఆ నిధులు ఏమవుతున్నాయో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కన్నడ భాషాభివృద్ధికి సమష్టి కృషి జరగాలి

● కన్నడ సంఘాల మహా మేళా



మాట్లాడుతున్న చౌకీ మఠం పీఠాధిపతి మర్రి రాచోటి మహాస్వామి

**ఆదోని టౌన్, ఆగస్టు 24 :** కర్ణాటక, ఆంధ్రా రాష్ట్రాలలోని కన్నడ సంఘాల సమష్టి కృషితో కన్నడ భాష, సంస్కృతుల అభివృద్ధి కోసం కృషి జరగాలని చౌకీ మఠం పీఠాధిపతి మర్రి రాచోటి మహాస్వామి, మండిగిరి మఠం పీఠాదిపతి గురుశిద్ధ దేవరు అన్నారు. శనివారం స్థానిక రెడ్డీస్ కల్యాణ మంటపంలో కర్ణాటక విద్యా, వర్ధక సంఘం (ధర్వాడ్)తో పాటు కర్నూలు, అనంతపూర్ జిల్లాలకు చెందిన కన్నడ సంఘాల వారు సంయుక్తంగా కన్నడిగుల 9వ సమ్మేళనాన్ని ఆదోని పట్టణంలో నిర్వహించారు. కన్నడ భాష, సంస్కృతులకున్న ప్రాముఖ్యత, ప్రత్యేకతల గురించి పీఠాధిపతులు వివరించారు. పట్టణ కన్నడ సంఘం అధ్యక్షుడు శరణబసప్ప, కార్యదర్శి గురు బసవరాజా, సహాయ కార్యదర్శి ఆది బసవ, కోశాధికారి సుంగరప్ప ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

## చేపలు పెంచుకుంటాం.. మాకు అవకాశం ఇవ్వండి



కార్యదర్శి శివకుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

**మద్దికెర, ఆగస్టు 24 :** మద్దికెర గ్రామంలోని మద్దమ్మ కుంట యజ్ఞం చెరువులో మా జీవనోపాధి కోసం చేపలు పెంచుకుంటామని మాకు అవకాశం ఇవ్వాలని బెస్త సంఘం నాయకులు భాస్కర్, సుగ్గులప్ప కోరారు. శనివారం ఎంపీడీవో నరసింహమూర్తికి, పంచాయతీ కార్యదర్శి భశివకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జీవనోపాధి కోసం ఎలాంటి వేలాలు లేకుండా మా కుల సంఘానికే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వెంకప్ప, శ్రీను, కృష్ణ, రామాంజులు, రామకృష్ణ పాల్గొన్నారు.

## 2వేల మందికి ప్రసాద వితరణ :

మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన ప్రముఖ విరాళాదాతలు పారా రామన్న, పారా ఆదిలక్ష్మమ్మ కుమారులు పారా రామచంద్రప్రసాద్, పారా విశ్వనాథ్ (చిట్టిన్న) మండలంలోని పెరవలి రంగనాథ స్వామి ఆలయంలో, కసాపురం ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో దాదాపు 2వేల మంది భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని శనివారం పంపిణీ చేశారు. ప్రతి ఏడాది శ్రావణామాసం మూడో శనివారం రంగనాథ స్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రసాదాల వితరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పారా జయవర్ధన్ తదితరులు ఉన్నారు.